క్లుప్తంగా

కడప వాసికి అరుదైన ఆపరేషన్



చికిత్స అనంతరం వైద్యులతో సిరసాల బాబు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మధుమణి నర్సింగ్ హోంలో కడపకు చెందిన వ్యక్తికి కంటి, ముక్కు, మెదడ మధ్యలో పెరుగుతున్న ఫంగస్ గడ్డను వైద్యులు ఆపరేషన్ ద్వారా తొలగించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. శుక్రవారం డాక్టర్లు డాక్టర్ మధుసూదనరావు, మణిదీప్ మాట్లాడుతూ కడప పట్టణానికి చెందిన సిరసాల బాబు మూడు నెలలుగా ప్యాంక్రియాస్ దెబ్బతిని జీర్ణవ్యవస్థ సరిగా పనిచేయక రోగనిరోధక శక్తి తగ్గడంతో ముక్కు నుంచి ఫంగస్ ఇన్ఫెక్షన్ సైనస్ గదులకు, ఎడమవైపు కంటికి, మెదడు వైపు ఎముకను తినివేస్తూ ప్రమాదకరంగా మారింది. మూడు రోజుల క్రితం ఆయన ఆసుపత్రిలో సంప్రదించడంతో గురువారం తెల్లవారుజామున అత్యంత ప్రమాదకరమైన ఫంగస్‌ను మ్యాక్సిల్లెక్టమీ, ఎడమ కంటి ఎక్స్‌ప్లోరేషన్ అనే ఆపరేషన్ చేసి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. డాక్టర్ శైలజ, రోహిత్, నాగమణి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులతో ఉపాధ్యాయినులు

ఆళ్లగడ్డ: రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపి 11వ స్థానంలో నిలిచారు. గత నెల 28న విజయవాడలో ఈఎండీపీ ఎక్స్‌పో (వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం) 2023 పోటీలు నిర్వహించారు. ఇందులో మొత్తం 53 ప్రాజెక్టులు ప్రదర్శనకు ఉంచగా.. సనాఫీర్, గౌసియా, లక్ష్మీ రూపొందించిన సీలింగ్ డస్ట్ కాచర్ ప్రాజెక్ట్ 11వ స్థానంలో నిలిచింది. వారికి ప్రశంసా పత్రం, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక పాఠశాలలో హెచ్ఎం ఫర్హత్ నసీమ్ అధ్యక్షతన వారితో పాటు సైన్స్ టీచర్ చెన్నకేశ్వరిని అభినందించారు.

ముసుగు దొంగలతో వాహనదారుల బెంబేలు

రుద్రవరం: మండలంలో ముసుగు దొంగలు వరుస దారి దోపిడీలకు పాల్పడుతుండటంతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. రాత్రి సమయాల్లో మోటార్ సైకిళ్లపై వెళ్లాలంటే ముసుగు దొంగలు ఎక్కడ దాడి చేస్తారోనని భయాందోళన చెందుతున్నారు. వారం క్రితం పెద్ద కంబలూరుకు చెందిన నాగేశ్వరరావు తన భార్యతో కలిసి తెల్లవారుజామున నంద్యాల రైల్వే స్టేషన్‌కు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ముగ్గురు దుండగులు ముసుగులు ధరించి దాడికి యత్నించారు. అలాగే గురువారం తెల్లవారుజామున పెద్ద కంబలూరు మెట్ట వద్ద అదే గ్రామానికి చెందిన పెద్ద మాబుపై ముసుగు దొంగలు దాడి చేసి నగదు,వెండి గొలుసు లాక్కున్నారు. తాజాగా పెద్ద కంబలూరుకు చెందిన చిన్న పాములేటి,పెద్దపాములేటితో పాటు మరో వ్యక్తి పేరూరు నుంచి చిన్న కంబలూరు మెట్ట వైపు 18వా బ్లాక్ కాల్వ కట్టపై వెళ్తుండగా ముగ్గురు ముసుగు దొంగలు రాళ్లతో దాడి చేశారు. అయితే వారు కూడా ఎదురు దాడి చేయడంతో దొంగలు పారిపోయారు. అయితే ఇప్పటి వరకు పెద్దకంబలూరు గ్రామస్తులపై జరిగిన ఘటనలు మాత్రమే వెలుగులోకి వచ్చాయి. దారి దోపిడీలతో పాటు మండల పరిధిలోని చిత్రేనిపల్లె వద్ద రెండు విడతలుగా దాదాపు 40 బోరు మోటార్ల విద్యుత్ తీగలు చోరీకి గురయ్యాయి. పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇఫ్తార్‌తో ఆత్మీయత పెంపు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాల(అర్బన్): ఇఫ్తార్ ప్రజల మధ్య ఆత్మీయతను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తెలిపారు. స్థానిక ఆటోనగర్‌లోని మజీద్-ఏ-జులేఖా ఖాశీం వద్ద ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌కు వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఆటోనగర్ జాకీర్, మాజీ కౌన్సిలర్ జాకీర్‌హుసేన్, సాయిరాంరెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు. అలాగే.. పట్టణంలోని వైఎస్సార్‌నగర్‌లో బుడగజంగాల సంఘం రాష్ట్ర నాయకుడు తాటికొండ బుగ్గరాముడు ఆధ్వర్యంలో దాదాపు 300 మంది ముస్లింలకు ఇఫ్తారు ఇచ్చారు. అలాగే 200 మంది పేద ముస్లిం మహిళలకు చీరల పంపిణీ చేశారు. నందవరపు ప్రసాదరెడ్డి, మరాఠీ సూరి, ఇమాముల్, అశోక్, రవి, కె.ప్రసాదరెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

వలంటీర్ నియామకం

రుద్రవరం: ముత్తలూరు గ్రామంలో క్లస్టర్ 8వ వార్డులో ఖాళీగానున్న వలంటీర్ పోస్టును భర్తీ చేశామని ఎంపీడీఓ మధుసూదనరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పథకాలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతుండటంతో నూతన అభ్యర్థిని నియమించామని చెప్పారు.

వేలం తీరు.. విమర్శల జోరు

చిన్న గ్రామాల్లో కూడా బండమెట్ట, మార్కెట్, కమేళా తదితర వేలాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుండటం చూస్తున్నాం. జిల్లా కేంద్రంలో మాత్రం పాత ధరలకే కేటాయిస్తుండటం, ధ్రువ పత్రాలు లేవని వ్యాపారులను వెనక్కి పంపి వేలాలు వరుసగా వాయిదా వేస్తుండటంపై అనుమానాలు ముసురుకుంటున్నాయి. ఇప్పటికే పశువుల సంతను గతేడాది ధరకు అప్పగించారు. ముఖ్యంగా వేలాలపై వ్యాపారులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని, వారి చర్యల కారణంగా కాంట్రాక్టర్లు సిండికేట్ మారుతున్నారనే విమర్శలున్నాయి.

- మున్సిపల్ వేలాలను గతేడాది ధరకే కేటాయిస్తున్న వైనం
- వివిధ కారణాలతో ప్రధాన మార్కెట్, పార్కింగ్ వేలం రెండు సార్లు వాయిదా
- వ్యాపారులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారేలా అధికారుల చర్యలు
- మున్సిపల్ ఖజానాకు భారీగా గండి పడే అవకాశం
- నేడు మూడోసారి వేలం



వేలం వాయిదాతో వెనుదిరుగుతున్న వ్యాపారులు



ఆర్ఓతో మాట్లాడుతున్న పశువుల సంత నిర్వాహకులు

నంద్యాల(సిటీ): వేలాలు ఉన్నాయంటే వివిధ రంగాలకు చెందిన వ్యాపారుల ఎంతో ఆసక్తి, పోటీ చూపుతారు. చిన్న గ్రామాల్లో నిర్వహించే వివిధ వేలాల ద్వారా గ్రామ పంచాయతీలకు రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. అలాంటిది నంద్యాల పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో వేలాలు జరుగుతున్నాయంటే వివిధ వర్గాలకు చెందిన వ్యాపారులు పోటాపోటీ పడటం సహజం. కానీ అధికారుల ఉదాసీనత, వ్యాపారులకు అవగాహన కల్పించకపోవడంతో వాయిదాల పర్వం కొనసాగుతోంది. దీంతో మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతుందని, ఇందుకు బుధవారం రెవెన్యూ విభాగంలో జరిగిన వేలాలే ఇందుకు నిదర్శనం.

వ్యాపారులకు అవగాహన కల్పించలేరా?

ప్రధాన మార్కెట్, పశువుల సంత నిర్వహణ, సైకిల్ స్టాండ్ పార్కింగ్ నిర్వహణ హక్కులు పొందేందుకు వేలాలు నిర్వహించారు. మున్సిపల్ రెవెన్యూ అధికారి వరప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించిన వేలాల్లో పాల్గొనే పాటదారులకు నిబంధనలపై అధికారులు అవగాహన కల్పించలేదు. సాధారణంగా వేలాలు నిర్వహించే ముందు నిబంధనలు, షరతులపై వ్యాపారులు, సంస్థలకు అవగాహన కల్పించాలి. అయితే అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో వేలాలకు అవసరమైన సాల్వెన్సీ సర్టిఫికెట్, డీడీలు, ధరావత్తు పత్రాలు సమర్పించలేకపోవడంతో వేలాలు వాయిదా పడ్డాయి. ఇది ఇలా ఉండగా గతంలో జరిగిన వేలాల్లో సుమారు రూ.కోటికి పైగా ఆదాయం వచ్చింది. ఈ ఏడాది మరింత పెరిగే అవకాశముందని భావించినా.. అధికారుల తీరు కారణంగా ఆదాయానికి గండి పరిస్థితి నెలకొంది.

తక్కువ ధరకు అప్పజెప్పేందుకే వాయిదాలా?

గత ఏడాది పశువుల సంత ద్వారా రూ.81 వేలు, సైకిల్ స్టాండ్ పార్కింగ్‌కు రూ.50 వేలు రాగా మార్కెట్ నిర్వహణకు రూ.83,98,000 లభించింది. అయితే 2023-24కు సంబంధించి ఆ మొత్తాన్ని తగ్గించేందుకే వేలాలు వాయిదా వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇది ఇలా ఉంటే రోడ్డు మార్జిన్, రోడ్డు మీద ఆక్రమణ చేసి వ్యాపారం చేస్తున్న వారి నుంచి, ప్రధాన కూరగాయల మార్కెట్, మార్కెట్‌లోని షాపుల రూముల కోసం, మూలసాగరం (బొమ్మల సత్రం) కూరగాయల మార్కెట్‌లతో సహా లారీలు, ట్రాక్టర్లు, మెటాడోరు వ్యాన్లు, స్వరాజ్‌మజ్దా తదితర సరుకుల తరలించే వాహనాలపై ఫీజు వసూలు చేసేందుకు వేలాలకు రూ.20 లక్షలు డిపాజిట్, సాల్వెన్సీ కింద రూ.20 లక్షలు, స్టాంపు డ్యూటీ కింద రూ.లక్ష చెల్లించాల్సి ఉంది.

అధికారుల చర్యలతో 'సిండికేట్'..

జిల్లాగా మారిన నంద్యాలలో మార్కెట్, పశువుల సంత, సైకిల్‌స్టాండ్ నిర్వహణను పాత ధరకే వేలం వేస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. మున్సిపాలిటీలోని మూడు విభాగాలకు వేలం నిర్వహించగా పశువుల సంతకు వ్యాపారులు ముందుకు వచ్చారని, మిగిలిన వాటిలో సరైన ధ్రువ పత్రాలు సమర్పించకపోవడంతో వాయిదా వేశామని కారణంగా చెబుతున్నారు. ఏప్రిల్ 1న సైకిల్‌స్టాండ్, మార్కెట్ సంతలకు మూడోసారి వేలం జరగనుంది. అధికారుల చర్యలు వ్యాపారులు సిండికేట్‌గా మారేందుకు ఊతమిస్తున్నాయనే విమర్శలున్నాయి. ఇందుకు పశువులు సంతను గతేడాది ధరకు కట్టబెట్టడమే నిదర్శనంగా చూపుతున్నారు. జిల్లా కేంద్రం అభివృద్ధిలో దూసుకుపోతున్నా వేలాల్లో పురోగతి లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్థిక సంవత్సరం మొదలైన రోజు ఎలా వేలం నిర్వహిస్తారనే ప్రశ్నలు కూడా వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల కోడ్ వల్ల వేలాలు ఆలస్యం..



ఫిబ్రవరిలో నిర్వహించాల్సిన వేలాలు ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా ఆలస్యమయ్యాయి. పశువుల సంత నిర్వహణకు పోటీ లేనందున గతంలో ఉన్న ధరకే కేటాయించాం. ఏప్రిల్ 1న ప్రధాన మార్కెట్, సైకిల్ స్టాండ్, పార్కింగ్ నిర్వహణకు వేలాలు నిర్వహిస్తాం. ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా చర్యలు చేపట్టాం.

– రవిచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్, నంద్యాల

మిర్చి రైతుల కష్టాలు తీర్చిన సీఎం



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(అర్బన్): మిర్చి రైతుల కష్టాలను తీర్చేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టెక్కె మార్కెట్ యార్డులో మిర్చి యార్డు ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మార్కెట్‌యార్డులో నిర్వహిస్తున్న మిర్చి క్రయవిక్రయాలను యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ట్రేడర్లు, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో మిర్చి దిగుబడులను గుంటూరు యార్డుకు వెళ్లి అమ్ముకోవాలంటే ఖర్చులు తడిసి మోపెడయ్యేవన్నారు. ఈ ఏడాది నుంచే కొనుగోళ్లను ప్రారంభించడం అభినందనీయమన్నారు.

ఆరుగురు వర్కర్ల సస్పెన్షన్

నంద్యాల(సిటీ): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆరుగురు వర్కర్లను సస్పెన్షన్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. ఇటీవల పట్టణంలో తాగునీటిని వదిలే క్రమంలో విద్యుత్ మోటార్లను సరైన సమయంలో ఆఫ్ చేయనందున కొన్ని వార్డులకు నీరు అందలేదనే ఫిర్యాదుల ఆధారంగా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ అథారిటీ ఆదేశాల మేరకు ఆ విభాగానికి చెందిన ఆరుగురు వర్కర్లను సస్పెండ్ చేశామన్నారు. పట్టణంలోని విశ్వనగర్, దేవనగర్-1, వీసీ కాలనీ, నర్సింగ్ క్వార్టర్స్, శ్యాంనగర్, సాదిక్ నగర్‌లో కొంత ప్రాంతంలో నీటిని సరైన సమయంలో సరఫరా చేయడం లేదని, వాల్వ్ ఫిట్టర్‌లు, లైన్‌ఆపరేటర్లు, మోటార్‌పంప్ ఆపరేటర్లు విధుల్లో అలసత్వం వహించడంతో సస్పెండ్ చేశామని చెప్పారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



రుద్రవరం మోడల్ స్కూల్‌లో టేబుళ్లు సిద్ధం చేస్తున్న దృశ్యం

రుద్రవరం: వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని స్థానిక ఏపీ మోడల్ పాఠశాల పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్, కస్టోడియన్ ఆఫీసర్ ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల ఉన్నత పాఠశాల నుంచి 400 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. వారి కోసం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, తువ్వపల్లె తిప్పమీదున్న మోడల్ పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా నిర్ణయించారు. ఒక్కో పాఠశాలలో 200 మంది పరీక్షలు రాస్తారని చెప్పారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 వరకు పరీక్షలుంటాయని, విద్యార్థులు అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, ఫర్నీచర్, విద్యుత్, మంచినీరు సౌకర్యం కల్పించాలమని వివరించారు. విద్యార్థులు అస్వస్థతకు గురైతే తక్షణం వైద్యం అందించేందుకు ప్రథమ చికిత్స కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయని, పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉండటంతో పాటు పోలీస్ బందోబస్తు ఉంటుందని వివరించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు..



శిరివెళ్ల: పది పరీక్షల్లో భాగంగా జిల్లాలో 6 సమస్యాత్మక పరీక్ష కేంద్రాలను గుర్తించారు. దీంతో ఆయా కేంద్రాలలోని గదుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6 గదులలో సీసీ కెమెరాలు అమర్చారు. రుద్రవరం, కొలిమిగుండ్ల మండలంలోని అంకిరెడ్డిపల్లె, గడివేముల, నందికొట్కూరులోని బాలికల పాఠశాల, బేతంచెర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమరాల ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటుతో మాస్ కాపీయింగ్, ఇతర అవతవకలు తెలిసిపోతాయని స్థానిక పరీక్ష కేంద్రం చీఫ్ విజయకుమార్ శుక్రవారం తెలిపారు.

మహిళలకు అండగా 'ఆసరా'

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- మండలంలో 3,507 మంది డ్వాక్రా మహిళలకు పథకం వర్తింపు



దొర్నిపాడులో పొదుపు మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి



కార్యక్రమానికి హాజరైన పొదుపు మహిళలు

దొర్నిపాడు: సీఎం జగనన్న అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం మహిళలకు అండగా నిలిచిందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా పొదుపు సంఘాల మహిళకు మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 347 పొదుపు సంఘాలకు గాను 3,507 మంది మహిళలకు మూడు విడతల్లో రూ.5,80,29,774 పంపిణీ చేసిందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు పసుపు కుంకుమ పేరుతో మోసం చేశారని విమర్శించారు. ఐదేళ్ల కాలంలో ఎన్నికలకు ముందు రూ.10వేలు ఇచ్చి వారిని మభ్యపెట్టినా.. జగనన్న మాత్రం సగటున ప్రతి గ్రూపునకు రూ.2లక్షల వరకు మాఫీ చేశారన్నారు. సచివాలయాల భవనాలు, నాడు-నేడు ద్వారా బడుల రూపు రేఖలు మార్చడం, దొర్నిపాడు, కొండాపురం, భాగ్యనగరం గ్రామాల్లో సీసీ రోడ్లు వేయడం అభివృద్ధి కాదా అని టీడీపీ నాయకులను ప్రశ్నించారు. మనందరి ప్రభుత్వం రాకముందు బడులు ఎలా ఉండేవో మీ అందరికీ తెలుసనని, ప్రస్తుతం ఎలా రూపుదిద్దామో ఒక్కసారి పాఠశాల ఆవరణలను పరిశీలిస్తే తెలిసిపోతుందన్నారు. అనంతరం మహిళలకు మెగా చెక్కు అందజేశారు. జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, దొర్నిపాడు సొసైటీ డైరెక్టర్ భూమా చెంచిరెడ్డి, ఎంపీడీఓ నాగఅనసూయ, ఏపీఎం బాబు, సచివాలయ మండల కన్వీనర్ శివారెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, మోహన్‌నాయుడు, కాశీవిశ్వనాథ్ రెడ్డి, శ్రీపతి ప్రసాద్, జాకీర్, రఫీ, మద్దిలేటి, శాంతయ్య, మనోహర్‌రెడ్డి, లక్ష్మికాంత్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, చిత్రంలో ఎస్పీ రఘువీర్ రెడ్డి

నంద్యాల: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను కాలయాపన చేయకుండా వీలైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డితో కలిసి ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుపై జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, డీఆర్ఓ పుల్లయ్య పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కేసులు దీర్ఘకాలం పెండింగ్‌లో ఉండకుండా వేగంగా పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కొత్త జిల్లా ఏర్పడిన ఏప్రిల్ నుంచి గత ఏడాది డిసెంబర్ నుంచి 69 కేసులు రిజిస్టర్ కాగా ఇందులో 102 మంది బాధితులకు ఎఫ్ఐఆర్ నమోదైన వాటికి రూ.24.50 లక్షలు, చార్జ్ షీట్ అయిన వాటికి రూ.81.75 లక్షలు, మొత్తం రూ.1.06 కోట్లు పరిహారం చెల్లించామన్నారు. అలాగే ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు 62 కేసులు నమోదయ్యాయన్నారు. ఇందులో 21 కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదైన వాటికి రూ.52.93 లక్షలు చార్జ్ షీట్ అయిన వాటికి రూ.83.12 లక్షలు, మొత్తం రూ.1.36 కోట్లు పరిహారం చెల్లించామన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై సంబంధిత అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకొని సత్వరమే పరిష్కరించి నష్ట పరిహారాన్ని చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఆర్ఓను ఆదేశించారు. అంబేడ్కర్ విగ్రహ మార్పుకు సభ్యులు సూచించిన స్థలాలను పరిశీలించాలన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అట్రాసిటీ కేసులకు సంబంధించిన విచారణలో సాక్షులు సహకరించాలని కోరారు. అక్రమ సారా తయారీ, మత్తు పదార్థాలు రవాణా చేసే వ్యక్తులపైనే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, అమాయకులపై చర్యలు తీసుకోమని స్పష్టం చేశారు. అలాగే ఆళ్లగడ్డ, ఆత్మకూరు, డోన్, నంద్యాలలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సివిల్ సప్లయీస్ డీఎం రాజునాయక్, డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ జయన్న, సంక్షేమ శాఖ డీడీ చింతామణి, నంద్యాల, డోన్, ఆత్మకూరు డివిజన్ల డీఎస్పీలు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం అండ



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ: అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం చాగలమర్రి మండలం పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాల్లో పర్యటించి సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రైతులు ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి బండ లాగుడు పోటీలను ప్రారంభించారు. ఎంపీపీ వీరభద్రుడు, సర్పంచ్ బంగారు షరీఫ్, ఎంపీటీసీలు లక్ష్మీరెడ్డి, పత్తినారాయణ, నాయకులు కుమార్‌రెడ్డి, షేక్ సోహెల్, రామగురివిరెడ్డి, దస్తగిరి ఉన్నారు.

ఆడపడుచులకు అండగా సీఎం జగనన్న



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే గంగుల

ఉయ్యాలవాడ : రాష్ట్రంలోని ఆడపడుచులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఎంఈపీ బుడ్డా భాగ్యమ్మ, సర్పంచ్ మేకల ఓబులేస్ అధ్యక్షతన మండలంలోని పొదుపు సంఘాల మహిళలతో వైఎస్సార్ ఆసరా మూడవ విడత కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎంపీ మేనిఫెస్టోను అమలు చేయలేక, ఆన్‌లైన్ నుంచి తొలగించిన వారు.. వందశాతం హామీలను నెరవేర్చిన తమ ప్రభుత్వం, పథకాలను విమర్శించడం సిగ్గుచేటన్నారు. అనంతరం మండలంలోని 291 గ్రూపుల్లోని 2,920 సభ్యులకు మంజూరైన రూ.1,48,46,097 మెగా చెక్కును మహిళలకు అందజేసి సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పొదుపు మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. అలాగే మండలంలోని సుద్దమల్ల గ్రామంలో ఆంధ్రప్రదేశ్ సోలార్ ప్రాజెక్ట్ లిమిటెడ్ రూ.40 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మిదేవి, పార్టీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పోచా వెంకటరెడ్డి, రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాధాకృష్ణారెడ్డి, మండల పొదుపు మహిళ సమైక్య అధ్యక్షురాలు ఉమామహేశ్వరరమ్మ, నాయకులు ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, గజ్జెల కృష్ణారెడ్డి, పీడీ శ్రీధర్‌రెడ్డి, డీపీఎం దానం, ఏపీఎం శేఖర్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి

ఆళ్లగడ్డ: ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. ఆళ్లగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మధ్యలో నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం పనులు ఇటీవల పునఃప్రారంభించారు. పనులను శుక్రవారం జిల్లా క్రీడల అధికారి ఎం.ఎస్ రాజుతో కలిసి పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, కోచ్ సుబ్బరాయుడు ఉన్నారు.

ప్రజాశ్రేయస్సే లక్ష్యం

- నీటి సమస్యపై తలెత్తనీయొద్దు
- నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు
- కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే శిల్పా రవి



కౌన్సిలర్ల సమస్యలను నోట్ చేసుకుంటున్న ఎమ్మెల్యే

నంద్యాల(సిటీ): ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా శ్రమిస్తున్నామని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా అజెండాలోని అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో నీటి సమస్య లేకుండా చూడాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన సమయంలో నీటిని అందించలేదని మున్సిపల్ అధికారులపై మండిపడ్డారు. సంక్రాంతికి నీరు ఇస్తామని చెప్పి మార్చి దాటినా నీరివ్వలేకపోవడంతో అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. నీరందించే విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేవలం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కొన్ని వార్డులకు రోజుల పాటు తాగునీరు అందకపోవడం బాధాకరమన్నారు.

'అమృత్' 90 శాతం పూర్తి...

అమృత్ పథకం ద్వారా ఇప్పటికే 90శాతం పనులు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. పథకం కింద రూ.137.34 కోట్లతో నిర్మాణం చేపట్టామన్నారు. పథకం ద్వారా ప్రతి ఇంటికి రక్షిత తాగు నీరు అందిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. వెలుగోడు రిజర్వాయర్‌లో ఇన్‌టేక్‌వెల్ సాంకేతిక నిర్మాణానికి అదనంగా అవసరమయ్యే రూ.22 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. అంతేకాకుండా డెడికేటెడ్ పవర్‌లైన్‌లకు అదనంగా రూ. 63 లక్షలు ఖర్చు చేయనున్నామన్నారు. కుక్కల బారిన పడిన ఘటనలు పట్టణంలో వినిపించరాదని ఎమ్మెల్యే ఆదేశించారు. మరోమారు పందులను తరలించి పట్టణంలో పందులు లేకుండా చేస్తామని కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు.

పార్కుల నిర్వహణకు కమిటీలు ఏర్పాటు చేయండి...

పట్టణంలో ఇప్పటికే పలు ప్రాంతాలలో ఉన్న 9 పార్కులను అభివృద్ధి చేశామని, వాటి నిర్వహణ బాధ్యతలు స్థానిక వృద్ధులను కమిటీలుగా నియమించి పార్కుల అభివృద్ధికి మున్సిపల్ అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ఒకటవ వార్డు ప్రజలకు చేరువగా వ్యర్థాలను వేయరాదని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ రమణమూర్తి, డీఈఈలు శ్రీనివాసరెడ్డి, మధుకుమార్, జయభారతరెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం చేపట్టి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ లక్ష్మినారాయణ, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, నరసింహ, అంబరీష్, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రమణ్యం శాస్త్రి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో వసంత నవరాత్రులను పురస్కరించుకొని శ్రీరామ నవమి పండుగ అనంతరం శుక్రవారం సీతారాముల మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరాముడికి శాస్త్రోక్తంగా, వేదమంత్రాల సాక్షిగా పట్టాభిషేకాన్ని అర్చక స్వాములు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఊంజల సేవతో వసంత నవరాత్రులు ముగిశాయి. కార్యక్రమంలో భగవత్ సేవా సమాజ్ సభ్యులు సూరయ్య, దేవరశెట్టి శ్రీనివాసులు, సుధీంద్రాచార్యులు, పవన్‌శర్మ పాల్గొన్నారు.